క్లుప్తంగా

వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశారు
–ఎంఈఓ 1 సయ్యద్ జప్రుల్లా



బొల్లాపల్లి: ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని వినుకొండ ఎంఈఓ 1 సయ్యద్ జప్రుల్లా అన్నారు. వినుకొండ రూరల్ మండలంలోని బారతాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన గుడిపాటి సాంబశివరావును మంగళవారం ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 మాట్లాడుతూ 28 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. సాంబశివరావు క్రమశిక్షణ పట్టుదలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని, ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 ప్రసూన, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూలు తనిఖీ చేసిన ఎంఈవోలు



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామం ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూలు ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితా కుమారిలు ఇరువురు మంగళవారం సాధారణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం ప్రధానోపాధ్యాయులు మెనూ ప్రకారం అమలు చేయడంతో పోషకాహారం అందించాలన్నారు. వంటకాల రుచిగా పరిశుభ్రంగా వండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు గాయత్రి, శ్రీనివాసమూర్తి, సీఆర్పీ ఏలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన
భార్య మృతికి కారణమైన భర్తను అరెస్ట్ చేయాలంటూ డిమాండ్



నరసరావుపేట టౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను అరెస్ట్ చేయటంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి కుటుంబ సభ్యులు మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. గత నెల 27వ తేదీన ఐలా బజార్‌కు చెందిన పసుపులేటి పల్లవి (22) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనతో భర్త పూర్ణచంద్రరరావు పరారయ్యాడు. కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు పల్లవి కుమారుడు 6 నెలల బాలుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ నినాదాలు చేశారు. సీఐ భాస్కర్ ఇచ్చిన హామీతో వారంతా ఆందోళన విరమించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు
– తప్పిన ప్రమాదం



యడ్లపాడు: కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి తిమ్మాపురం ట్రిపుల్ ఆర్ వెంచర్ సమీపంలో హైవే డివైడర్‌ను ఢీకొంది. సరిగ్గా అదే సమయంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, లోపలి బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకునే సరికి ప్రమాదానికి గురైన కారులోని ప్రయాణికులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. హైవే రహదారిపై అడ్డంగా ఉన్న ప్రమాదానికి గురైన కారును పక్కకు తీసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమబద్ధీకరించారు.

అన్ని గ్రామాల్లో నేను బడికిపోతా

- ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీల భాగస్వామ్యంతో కార్యక్రమాల నిర్వహణ



గణపవరం చవిటిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు

నాదెండ్ల: విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు నాలుగు వారాల పాటూ నేను బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. సోమవారం అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటూ పేరెంట్స్ కమిటీని భాగస్వాములను చేస్తూ చిన్నారుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేస్తున్నారు. సంకురాత్రిపాడు గ్రామంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు సుందరరావు, సీఆర్పీ ఇందిర, ర్యాలీ నిర్వహించారు. సాతులూరు గ్రామంలో జెడ్పీ హైస్కూలు హెచ్ఎం వెంకటరావు, సీఆర్పీలు దావులూరి సింగయ్య, షేక్ బాజీ, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. చిరుమామిళ్ళ గ్రామంలో హెచ్ఎం షేక్ కరిముల్లా, ఉపాధ్యాయులు మూర్తి, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, గణపవరం చవిటిపాలెంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శారద, అంగన్‌వాడీలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేను బడికిపోతా విజయవంతం చేయండి

శావాల్యాపురం: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు కోరారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో నేను బడికి పోతాను కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా మాట్లాడి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సహకారం తీసుకొని విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అందించే పథకాలు పోషకాహారం తదితర విషయాలన్నీ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణతులసి, వేల్ఫేర్ సహాయకులు మస్తానయ్య పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న విద్యాశాఖాధికారులు



సంకురాత్రిపాడులో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు



సంకురాత్రిపాడులో ర్యాలీలో ఉపాధ్యాయులు

జిల్లాకే గర్వకారణం డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ సేవలు

- మూగ, చెవుడు కాక్లియర్ ఆపరేషన్ చేసిన వారికి స్విచాన్ చేసిన ఎమ్మెల్యే
- హాస్పిటల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- హాస్పిటల్‌లో మరో అద్భుతమైన గుండె ఆపరేషన్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎండీ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ ఆధునిక పరికరాలతో పల్నాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తూ జిల్లాకే గర్వకారణంగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మంగళవారం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ సందర్శించారు. హాస్పిటల్‌లో తొలిసారిగా ఏఎస్‌డీ క్లోజర్ (ఏట్రియల్ సెప్టెల్ డెఫెక్ట్) సహాయంతో పేషెంట్‌కు గుండెలో గదులను సపరేట్ చేసి మిషన్ ద్వారా పేషెంట్ ప్రాణాలు కాపాడిన హాస్పిటల్ వైద్య బృందాన్ని, మేనేజింగ్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ కోట అంబరీష్‌లను అభినందించారు. జిల్లాలో ఇప్పటి వరకు వంద మంది పుట్టు మూగ, చెవుడు పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపి వారి తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం ఏర్పరిచారన్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన ఇద్దరికీ స్విచ్ఆన్ ప్రోగ్రాం చేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కోట అంబరీష్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో మరో అద్భుతమైన సర్జరీ చేశామన్నారు. చాగంటివారి పాలెం గ్రామానికి చెందిన సీహెచ్.పున్నమ్మ అనే పేషెంట్ తీవ్రమైన గుండె నొప్పితో పట్టణంలోని అన్ని హాస్పిటల్స్ తిరిగి చివరగా తమ హాస్పిటల్‌కి వచ్చిందన్నారు. పరీక్షలు చేసి పేషెంట్ గుండెలోని రెండు గదులకు రంధ్రం ఉందని గుర్తించామన్నారు. సర్జరీ చేయాలని పేషెంట్లకు చెప్పి వాళ్ళతో ఆమోదం తీసుకున్న అనంతరం ఆపరేషన్ చేసి పేషెంట్ ప్రాణాలు కాపాడటం జరిగిందన్నారు. ఇలాంటి అరుదైన గుండె ఆపరేషన్లు గతంలో మహానగరాల్లో మాత్రమే చేశారన్నారు.

ఇప్పుడు నరసరావుపేటలో ఇలాంటి సంక్లిష్టమైన ఆపరేషన్ చేయటం జరిగిందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వైద్య సేవలను పల్నాడు, పక్క జిల్లాల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

వైభవంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ఎమ్మెల్యే ప్రత్తిపాటిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయాలయ తొలి వార్షికోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి వార్ల కల్యాణం, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికులతో పాటూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రధాన పూజారి దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్ కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.

అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట దేశానికి ఆదర్శం: కూర్మనాథ స్వామి

భారతదేశం యావత్తు ఎదురుచూసిన అయోధ్య రామాలయ నిర్మాణం సాకారం కావటం యావత్ దేశ ప్రజలకు సంతోషం కలిగించిందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి శిష్యుడు గుదిమెళ్ళ కూర్మనాథ స్వామి అన్నారు. బాలరాముడి ప్రతిష్ట దేశానికి ఆదర్శమన్నారు. ప్రతి గ్రామంలో శ్రీరాముడి ఆలయాల్లో నిత్య పూజలతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాముడి కల్యాణం ఒక్కో ప్రాంతంలో ఒక్కో సాంప్రదాయబద్ధంగా జరుగుతుందన్నారు. మన ప్రాంతంలో జీలకర్ర, బెల్లం వధూవరుల తలపై ఉంచటం, కొన్ని ప్రాంతాల్లో దండలు మార్చుకోవటం వంటి ఆచారాలు వివాహ వ్యవస్థలో అనుభూతులిస్తాయన్నారు. ఈగ్రామంలో ఇంత సుందరంగా పూర్తిరాతితో ఆలయాన్ని నిర్మించటం గ్రామస్తుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, వలేటి నరసింహారావు, గాలి బుచ్చయ్య, తూబాటి శ్రీహరిరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, కేతినేని శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా వడ్డీలేకుండా పన్నులు చెల్లించండి

నరసరావుపేట: నెలాఖరులోగా వడ్డీలేకుండా ఖాళీ స్థలాలు, ఆస్తిపన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. 2024–25 ఏడాదిలో అర్ధ సంవత్సరానికి వడ్డీలేకుండా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించేందుకు ఈనెల ఆఖరు 30తో గడువు ముగుస్తుందన్నారు. చెల్లించని వారు జూలై ఒకటవ తేదీ నుంచి పన్ను బకాయిలపై వందకు రూ.2ల వడ్డీ చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. వడ్డీలేకుండా చెల్లించేందుకు కేవలం మరో ఐదురోజుల గడువు మాత్రమే ఉందన్నారు.

కౌలు రైతులంతా సాగు పత్రాలు పొందాలి
ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట: కౌలు రైతులంతా తప్పనిసరిగా సాగు పత్రాలు పొంది బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు పొందాలని వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల, చిగురుపాడు గ్రామాలలో మంగళవారం కౌలు రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా పంట సాగు పత్రాలను 11 నెలల కాలపరిమితితో రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుంది తప్ప భూములపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. అందువల్ల భూ యజమానులు కౌలు రైతులు బ్యాంకులలో రుణాలు పొందేందుకు ఎలాంటి అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అంతే కాక కౌలు పత్రాలకు కేవలం 11 నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుందన్నారు.

సీసీఆర్సీతో బహుళ ప్రయోజనాలు



సాతులూరు ఆర్‌బీకే కేంద్రంలో కౌలు రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నాదెండ్ల: కౌలు రైతుల గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు అందుతాయని సాతులూరు వీఆర్వో మురళీ చెప్పారు. గ్రామంలోని రెండు రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై గ్రామ సభలు నిర్వహించారు. వీఆర్వోలు అంజలి, వి.వేణుగోపాల్, బి.రామారావుతో పాటూ ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు. 32 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెలాఖరు వరకూ గ్రామ సభలు జరుగుతాయన్నారు. సంబంధిత కౌలు రైతులు ఆధార్ కార్డు, భూ యజమాని పాసుపుస్తకం జిరాక్సు కాపీలతో దరఖాస్తు చేసుకున్నట్లయితే కౌలురైతు గుర్తింపు కార్డు అందిస్తామన్నారు. సాధారణ రైతులతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్స్‌లు వగైరాల లబ్ధి కలుగుతుందన్నారు. ఇప్పటి వరకూ మండల పరిధిలో 72 మంది కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఏవో ఎ.హరిప్రసాద్ తెలిపారు.

రేపు పడవల నిర్వహణకు వేలం

అచ్చంపేట: మండల సరిహద్దులోని కృష్ణానదిపై పడవల ద్వారా ప్రయాణికులను నది దాటించే హక్కు పొందేందుకు ఈ నెల 27న గుంటూరు జెడ్పీ సమావేశపు హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడతాయని ఎంపీడీవో కుసుమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెజిట్ నిబంధనల మేరకు 2024-25 సంవత్సరానికి అంటే జూలై 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు 9 నెలల కాలానికి కృష్ణానదిపై పడవలు, బల్లకట్టు నడుపుకునే హక్కు ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ధరావతుగా ప్రభుత్వం నిర్ణయించిన సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. అచ్చంపేట మండలం చామర్రు నుంచి కృష్ణా జిల్లా కాసరబాద వరకు అప్‌సెట్ మనీ రూ.2,07,000 కాగా ధరావతు రూ.69 వేలు, చింతపల్లి నుంచి కృష్ణా జిల్లా ఇస్తేపల్లి వరకు అప్‌సెట్ మనీ రూ.1.65 లక్షలు కాగా ధరావతు రూ.55 వేలు, గింజుపల్లి నుంచి వేదాద్రి వరకు అప్‌సెట్ మనీ రూ.97,500 కాగా ధరావతు సొమ్ము రూ.32,500, తాడువాయి నుంచి రామన్నపేట వరకు అప్‌సెట్ ప్రైస్ రూ.8,49,750 కాగా ధరావతు రూ.2,83,000, మాదిపాడు నుంచి ముక్త్యాల వరకు అప్‌సెట్ ప్రైస్ రూ.9,93,750 కాగా రూ.3,31,000 చెల్లించాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి

అచ్చంపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించవలసి ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఉమారాణి తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ప్రాజెక్టు స్థాయి సమావేశంలో ఆమె పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు రాకుండా వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలను తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అదే విధంగా రుతుక్రమంలో వచ్చే మార్పుల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి ఉమామహేశ్వరి, మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



స్టూడెంట్స్ కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ

బొల్లాపల్లి: మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే జీవీ అంజనేయులు అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగ స్టూడెంట్ కిట్స్ అందజేశారు. తొలుత గ్రామంలో మేం బడికి పోతాం కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేసి మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీఓ వీపీ విజయకుమార్, ఈఓపీఆర్డీ ఎస్‌కె జిలానీ బాషా, ఎంఈఓ 2 కె పార్వతి, మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.పద్మావతి, కె.అపర్ణ, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తి సేవలు అభినందనీయం



రాధాకృష్ణమూర్తిను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: జాతీయస్థాయి క్రీడా పోటీల్లో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంచి గుర్తింపు తేవడంతో బాలికలకు క్రీడాపోటీల్లో మంచి తర్ఫీదు ఇవ్వటం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలోని జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటిన్ క్రీడాల్లో రాణించేలా తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యతో క్రీడాల్లో జాతీయ స్థాయిలో తేవడానికి కృషి చేసిన పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి పనితీరుకు నిదర్శనమన్నారు. ఇప్పటి వరకు జాతీయస్థాయి బాలికల క్రీడా పోటీల్లో ఆకుమళ్ళ సమీరా, ముక్కపాటి లిఖిత, వేముల దివ్య, ఉప్పు బసవరాణి, గుంటకల వెన్నల, ఓర్సు స్రవంతి, బాలికల్లో బాల్ బ్యాడ్మింటిన్ క్రీడాస్ఫూర్తి పెంపొందించటం శుభ పరిణామమన్నారు. అనంతరం పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తిని దుశ్శావాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరావు, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, నిర్మల, అబ్దుల్లా పాల్గొన్నారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేయాలి



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతి పత్రం అందజేస్తున్న రైల్వేలైన్ సాధన సమితి సభ్యులు

చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలో రైల్వేలైన్ ఏర్పాటుకు ఇచ్చిన హామీ మేరకు కృషి చేయాలని చిలకలూరిపేట రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ చిలకలూరిపేటకు రైల్వే లైన్ ఎంతో అవసరమని ఆ దిశగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైల్వేలైన్ ఏర్పాటు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, స్థానికంగా ఉన్న పరిశ్రమలకు ఎగుమతులు, దిగుమతులు సులభతరం అవుతాయని వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సైతం రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రైల్వేలైన్ వల్ల ఈ ప్రాంతం అన్ని విధాల పురోగమిస్తుందని ఆ దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైల్వేలైన్ సాధన సమితి సభ్యులు మల్లిఖార్జున్, నవీన్ తదితరులు ఉన్నారు.

భూ యజమాని అంగీకారంతోనే దరఖాస్తు ఆన్‌లైన్

వ్యవసాయాధికారి శివలలిత



మాట్లాడుతున్న శివ లలిత

రొంపిచర్ల: భూ యజమాని అంగీకారంతోనే కౌలు రైతు దరఖాస్తును ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి శివలలిత అన్నారు. మంగళవారం మండలంలోని నల్లగార్లపాడు, వి.రెడ్డిపాలెం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో శివ లలిత మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డుల కోసం కౌలు రైతులు అందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి కౌలురైతు విలేజ్ రెవెన్యూ అధికారి లాగిన్‌లో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. దరఖాస్తుపై భూ యజమానితో పాటు కౌలురైతు సంతకం తప్పనిసరన్నారు. దరఖాస్తుతో పాటు పట్టాదార్ పాస్ బుక్కు, ఆధార్ కార్డులు నకళ్లను జత చేయాలన్నారు కార్డుల వల్ల వ్యవసాయ శాఖ తరపున రైతులకు రాయితీపై వచ్చే విత్తనాలతో పాటు ఈ క్రాప్ నమోదు, పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం ఇస్తారన్నారు. కౌలు రైతు పండించిన పంటకు మద్దతు ధరకు పంట కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. అలాగే అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు క్రాప్ ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలు ఈ కార్డుల వల్ల చేకూరతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి కౌలు రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసిల్దార్ సుబ్బారావు, వీఏవోలు, వీఆర్వోలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రాలతో రైతులకు మేలు

మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య



మన్నెసుల్తాన్ పాలెంలో మాట్లాడుతున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలతో ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు సాగు చేయు రైతులందరూ తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రాలు పొందాలని తెలిపారు. భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్‌తో గ్రామ రెవెన్యూ అధికారి, రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి సీసీఆర్‌సీ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట సాగుదారు హక్కు పత్రం 11 నెలలు గడువు కలిగి భూ యజమాని హక్కులకు భంగం కలుగకుండా జారీ చేయబడుతుంన్నారు. పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పొందుటకు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం సంభవించిన పంట నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ హక్కు పత్రాలు ఉపయోగ పడతాయని తెలిపారు. కావున భూ యజమానులు పంట సాగుదారులకు సహకరించాలన్నారు. అర్హులైన వారు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లక్ష్మీనారాయణ, వీఏఏ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.